క్లుప్తంగా

చెత్తతో సంపద సృష్టించాలి



చెత్తతో ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాలాయపల్లి(సైదాపురం): ప్రతి పంచాయతీ లోనూ చెత్తతో సంపద సృష్టించుకోవాలని గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకట రమణ తెలిపారు. బాలాయపల్లిలో శుక్రవారం గూడూరు డివిజన్‌లోని 134 పంచాయతీల కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. దాన్ని రైతులకు విక్రయించి ఆదాయం పొందాలని సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ శిరీష, ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌రాజు, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



బాలయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దొరవారిసత్రం : మండలంలోని పూలతోట పంచాయతీ మాజీ సర్పంచ్ కే బాలయ్య మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే పరసారత్నం తదితరులు శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



హోలీప్రేయర్ చర్చిలో సందేశాన్ని వినిపిస్తున్న విశ్వప్రసాద్

కోట : విద్యానగర్ హోలీ ప్రేయర్ చర్చిలో శుక్రవారం అభిలాష్‌సన్నీ నాలుగో వర్ధంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ క్రిష్టియన్ విభాగంలో కీలకంగా పనిచేసిన రెవరెండ్ అభిలాష్‌సన్నీ కరోనా సమయంలో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయవాడ నుంచి వచ్చిన రెవరెండ్ విశ్వప్రసాద్ దేవుడి సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో బిషప్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్టమూరు : మండలంలోని అరవపాళెం, ఆరూరు గ్రామాల్లో శుక్రవారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. బీపీ, షుగర్‌తో పాటు పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు చిట్టమూరు పీహెచ్‌సీ వైద్యురాలు పద్మావతి, స్విమ్స్ మెడికల్ అధికారులు చైతన్య, భాను, పద్మావతి తెలిపారు.

మహిళా పోలీసుకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న మాధురి

చిట్టమూరు : మల్లాం గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న బాలిబోయిన మాధురి విక్రమ సింహపురి వీసీ అల్లం శ్రీనివాసరావు చేతులు మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఆమె హ్యూమన్ రిసోర్స్ ఇంఫ్రమేషన్ అనాలసిస్ సిస్టమ్ డిజైన్ విత్ కృష్ణపట్నం పోర్టు అనే అంశంపై పరిశోధన చేశారు. ఆమెను సహచర ఉద్యోగులు అభినందించారు.

భూ సమస్య పరిష్కరించాలని వినతి

చిట్టమూరు : భూ సమస్య పరిష్కరించాలని యాకసిరి పంచాయతీ పాటిమిట్ట గ్రామానికి చెందిన రైతులు కోరారు. వారు శుక్రవారం తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గునపాటిపాళెంకు చెందిన రైతుకు సర్వే నంబర్ 218–1లో 2.40 ఎకరాల భూమి ఉండగా రికార్డుల్లో 2.78 ఎకరాలు ఉన్నట్టు నమోదు చేసినట్టు తెలిపారు. దీంతో అతను పక్కనున్న తమ పొలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని వాపోయారు. సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.

పిల్లర్లకే పరిమితం



దొరవారిసత్రం మండలం పూలతోటలో నిర్మాణం పూర్తి కాకుండానే శిథిలమైపోతున్న చెత్త సంపద కేంద్రం

సూళ్లూరుపేట : గ్రామాల నుంచి చెత్తను సేకరించి వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందాలని చేపట్టిన కేంద్రాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో కేంద్రాలను నిర్వహించకపోవడంతో మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో చెత్తను జాతీయ రహదారి పక్కనే డంపింగ్ చేసి తగులబెడుతున్నారు. అదే విధంగా తడ మండలం తడకండ్రిగ, తడ పంచాయతీల నుంచి సేకరిస్తున్న చెత్తను బోడిలింగాలపాడు త్రిభువనేశ్వరి ఆలయం సమీపంలో జాతీయ రహదారికి పక్కనే డంప్ చేస్తున్నారు. నెలలో మూడు, నాలుగుసార్లు నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ దట్టంగా జాతీయ రహదారిని కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ పొగను పీల్చడంతో సమీపంలోని ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారు. నాయుడుపేట పట్టణంలోనూ చెత్త సంపద కేంద్రం లేదు. పూడేరు పంచాయతీలోని రేవలగుంటలో సుమారు 10 ఎకరాలు అటవీ ప్రాంతంలో చెత్తను డంప్ చేసి కాలుస్తున్నారు.







దొరవారిసత్రం మండలం వేణుంబాకంలో ఆగిపోయిన సంపద కేంద్రం, ఓజిలి పంచాయతీలో చెట్లు మొలిచి కనిపించని చెత్త సంపద కేంద్రం, తడ : కొండూరులో నిరుపయోగంగా వున్న చెత్త సంపద కేంద్రం

నేడు మామిడి ఫలసాయం వేలం పాటలు

వెంకటగిరి రూరల్ : మండలంలోని పెట్లూరు సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం చీనీ, నిమ్మ పరిశోధనా స్థానంలో మామిడి వేలం పాటలు శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త పి శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. ఫీల్డ్ నంబర్ 5, 32, 33లలో 70 మామిడి చెట్లలోని కాయలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వెండి చీరలో రాజరాజేశ్వరి అమ్మవారి దర్శనం



గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో జెడ్పీ హైస్కూల్ రోడ్డులో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారు శుక్రవారం వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి చీరతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పీహెచ్‌సీకి హైడ్రాలిక్ బెడ్ వితరణ



ఆస్పత్రికి హైడ్రాలిక్ బెడ్ అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

చిల్లకూరు : చిల్లకూరు పీహెచ్‌సీకి శుక్రవారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాటిపర్తి బలరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుగణమ్మ రూ.20 వేల హైడ్రాలిక్ బెడ్‌ను వితరణ చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధి సనత్‌కుమార్ మాట్లాడుతూ తమ సంఘం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అరాఫత్, తేజస్విని, సంఘం ప్రతినిధులు డాక్టర్ పేట వెంకటక్రిష్ణారెడ్డి, డేగపూడి కిషోర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, మండి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఓజిలి: పరిసరాల శుభ్రతతో వ్యాధులను నియంత్రించవచ్చని పెదపరియ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి వినీషా తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిలమానుచేను, పెదపరియ, ఆర్మేనిపాడు గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మురుగు కాలువల్లో దోమల లార్వా వృద్ధి చెందడం వల్ల మలేరియా జ్వరం ప్రబలుతుందన్నారు. పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, పాతటైర్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చలపతి, సూపర్‌వైజర్ కృష్ణవేణి, హెల్త్‌అసిస్టెంట్లు వెంకటరమణయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథంపై ఊరేగుతున్న స్వామి వారు

సైదాపురం: మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలోని వైకుంఠపురంలో శ్రీమహావిష్ణువు మహాలక్ష్మిదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు రథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి స్వామి, అమ్మవారి రథోత్సవం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రాపూరు సీఐ సత్యనారాయణ బందోబస్తు చేపట్టారు.

రాపూరు సబ్ ట్రెజరీ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డి.గంగాద్రి

రాపూరు: నెల్లూరు జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ డి.గంగాద్రి శుక్రవారం రాపూరు సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరులో చేపట్టిన ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. రెండు నెలల్లో ప్రారంభిస్తామని వెల్లడించారు. అలాగే కావలి, ఆత్మకూరు, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాల్లోనూ నూతన భవన నిర్మాణాలు పూర్తియ్యాయని తెలిపారు. కొవ్వూరులో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, బుచ్చిరెడ్డిపాలెంలో స్థల పరిశీలన చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పొదలకూరులో రీటెండర్లు పిలిచి భవన నిర్మాణాన్ని చేపడతామన్నారు. ఉపఖజానా అధికారి అబ్దుల్ అలీమ్, సిబ్బంది వెంకటకృష్ణ, అమీర్‌బాషా, సుబ్బరాయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమాయకులపై ఉగ్రవాదుల దాడి హేయం



ప్రార్థన చేస్తున్న ముస్లిం మత పెద్దలు, తదితరులు

నాయుడుపేట టౌన్ : జమ్ము కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని ముస్లిం మత పెద్దలు ఖండించారు. పట్టణంలోని జామియా మసీదు వద్ద శుక్రవారం మధ్యాహ్నం నమాజు అనంతరం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమాయకులను పొట్టన పెట్టుకున్న నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జామియా మసీదు మౌలానా అబూబకర్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ షేక్ షరీఫ్, రియాజ్, పఠాన్ షంషీర్, నవజవాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మా స్థలాలను ఆక్రమించుకుంటున్నారు



డీఎస్పీ కార్యాలయం వద్దకు వచ్చిన మాతమ్మలు

గూడూరు రూరల్ : ప్రభుత్వం మాకు 30 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు తమ పేరుతో పట్టాలు చేయించుకుంటున్నారని పలువురు జోగినులు వాపోయారు. వారు శుక్రవారం గూడూరు డీఎస్పీకి ఫిర్యాదు చేయడానికి కార్యాలయానికి వచ్చారు. డీఎస్పీ గీతాకుమారి లేకపోవడంతో విలేకరుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. మాతమ్మలుగా ఉన్న 47 మందికి 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చిందన్నారు. కొంతమంది ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. ఆర్థిక స్థోమతలేని కొందరు స్థలాలను అలాగే వదిలి పెట్టినట్టు తెలిపారు. వాటిని మీడియాకు చెందిన ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల పేరుతో పట్టాలు మార్పు చేసుకున్నాడని ఆరోపించారు. దానిపై అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తిరుపతి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని, ఆయన గూడూరు రూరల్ పోలీసులను కలవాలని చెప్పారని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

చిల్లకూరు : గూడూరులో పేద వైద్యుడిగా పేరొందిన సీఆర్‌రెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుస్తులు అందజేశారు. ప్రముఖ డాక్టర్ రోహిణి మాట్లాడుతూ సీఆర్‌రెడ్డి జ్ఞాపకార్థం సాయిరామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద వున్న మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం రఘురామరాజు, సుజాతమ్మ కుటుంబ సభ్యులు బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు, కొంత నగదు అందజేశారు. వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో భేషువర్మ దాసరిరాజు, ఆశ్రమ నిర్వాహకులు బెన్ని పాల్గొన్నారు.



చిల్లకూరు : వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రోహిణి



నాయుడుపేట టౌన్ : ఆశ్రమ నిర్వాహకులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

చిల్లకూరు : గూడూరు సమీపంలో ఉన్న నెల్ క్యాస్ట్ పరిశ్రమలో శుక్రవారం గూడూరులోని రోటరీ వెస్ట్ క్లబ్, పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించారు. నెల్లూరులోని కిమ్స్ వైద్యశాల వైద్యులు కార్మికులకు బీపీ, షుగర్, గుండె, మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు చేసి మందులు అంజేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. సీనియర్ రొటేరియన్, క్లబ్ గౌరవ అధ్యక్షుడు యల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నెల్ క్యాస్ట్ పరిశ్రమలో ప్రతి ఏటా వైద్య శిబిరాలు నిర్వహించి కార్మికులకు వైద్యం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిమ్స్ పీఆర్‌వో నవీన్‌జయకుమార్, పరిశ్రమ పీఆర్‌వో అనిమెళ్ల శివకుమార్, రొటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాశిన నాగులు, చోళవరం గిరిబాబు, సభ్యులు వాసుగౌడ్, శ్రీకంఠి రామ్మోహన్‌రావు, ధనుంజయరెడ్డి, దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, ప్లాంట్ ఇన్‌చార్జి వెంకటేశన్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

డీఈఈగా పురుషోత్తం



బాధ్యతలు చేపట్టిన పురుషోత్తం

కలువాయి(సైదాపురం): సోమశిల ప్రాజెక్ట్ ఉప విభాగం డీఈఈగా జె.పురుషోత్తం శుక్రవారం కలువాయి ఇరిగేషన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన చీరాల నుంచి బదిలీపై కలువాయికి వచ్చారు.

మట్టి నమూనాల సేకరణ

వెంకటగిరి రూరల్ : మండలంలోని పారవోలు, చింతగుంటకు చెందిన రైతుల పొలాల్లో శుక్రవారం భూసార పరీక్షలు చేయడానికి మట్టి నమూనాలు సేకరించారు. వీఏవో శివకుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకుని ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఎరువుల వినియోగం, అలాగే పంటల సాగుకు అయ్యే పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు.

హర్షిత ప్రియకు కలెక్టర్ అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ ఆనంద్

కలువాయి(సైదాపురం) : పదో తరగతిలో 568 మార్కులు సాధించిన కలువాయి మండలానికి చెందిన పేద విద్యార్థిని హర్షిత ప్రియను నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ శుక్రవారంఅభినందించారు. ఇంటర్‌లో మంచి కళాశాలలో చేరేందుకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

గూడూరు విద్యార్థినికి కమిషనర్ అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

చిల్లకూరు : పదో తరగతిలో 598 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన గూడూరులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని సాయి వైశాలిని శుక్రవారం గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసులు, డీన్ శ్రీహరిబాబు, హరిబ్రహ్మాయాదవ్, గాంధీ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ కూలర్ల వితరణ

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు సచివాలయం, పోలీసుస్టేషన్‌కు శుక్రవా రం కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వేలూ రు కళ్యాణ్‌రెడ్డి ఎయిర్ కూలర్లు వితరణ చేశా రు. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, సచివాలయం, పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఎయిర్ కూలర్లు అందజేసినట్టు తెలిపారు.

మాజీ బిషప్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న బిషప్ మైఖేల్ బెన్‌హర్

నాయుడుపేట టౌన్ : ఎస్‌ఏఎల్‌సీ చర్చి మాజీ బిషప్ మైఖేల్ బెన్‌హర్‌కు హైదరాబాద్‌కు చెందిన ఆంధ్ర క్రిస్టియన్ థియోలాజికల్ కాలేజి వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. హైదారాబాద్‌లో గురువారం రాత్రి ఆ సంస్థ 61వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సంఘం తరపున చేసిన సేవలను గుర్తించి డాక్టర్ ఆఫ్ డివినిటి హనారిస్ కౌసా పేరుతో బిషప్ బెన్‌హర్‌కు ఆంధ్ర క్రిస్టియన్ థియోలాజికల్ కాలేజి వ్యవస్థాపకులు ఆర్‌ఆర్ సుజీవరావు డాక్టరేట్ అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయం దిగ్బంధం



కార్యాలయం వద్ద బైఠాయించిన ఆందోళనకారులు

సైదాపురం: ఊటుకూరు దళితులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దళితులు తహసీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. ఆయన మాట్లాడుతూ ఊటుకూరు సమీపంలో సర్వే నంబర్ 359, 356లో వున్న భూమిని భూస్వాములు, పెత్తందారులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వాటిని సర్వే చేసి స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెట్టాలన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు మైనింగ్ మాఫియాతో కుమ్మక్కై దళితులపై కేసులు పెట్టారని దుయ్యబట్టారు. తహసీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు ఎస్‌ఐ క్రాంతికుమార్, పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకారులపై రెండు కేసులు నమోదు

అనుమతి లేకుండా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతో పాటు రోడ్డుపై వాహనాలను నిలిపివేసినందుకు అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలు, ఆందోనకారులపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు గనులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న చింతామోహన్

గూడూరు రూరల్ : గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లోని సిలికా, క్వార్ట్జ్, ఇసుక, గ్రావెల్ గనులను ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు కేటాయించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతా మోహన్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 46లో పేర్కొన్న విధంగా అణగారిన వర్గాల వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందించాలన్నారు. త్వరలో 45 గనులను కేటాయించనున్నారని, అందులో సామాజిక న్యాయం పాటించాలని కోరారు. అనంతరం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామక్రిష్ణ, వెంకటయ్య, చందనమూడి శివ, పెంచలయ్య, దయాకర్, పూల చంద్రశేఖర్, చిల్లకూరు వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజైన్ ఇంజినీరింగ్‌లో మంచి అవకాశాలు



సదస్సులో మాట్లాడుతున్న నాగార్జున

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం మెక్సోడియా 2025 సదస్సు నిర్వహించారు. టాటా ఎల్క్సి సంస్థ, యూకే లీడ్ డిజైన్ ఇంజినీర్ నాగార్జున కెరీర్ ఆపర్చునిటీస్ ఫర్ డిజైన్ ఇంజినీర్ అనే అంశంపై మాట్లాడారు. ఏరోస్పేస్, ఆటోమోటివ్, బయోమెడికల్ రంగాల్లో మెకానికల్ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మా ట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి తమ కళాశాలలో రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో ఎంటెక్ కోర్సును ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ విక్రమ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



బదిలీపై వెళుతున్న పోలీసులను సన్మానిస్తున్న ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది

పెళ్లకూరు: విధుల్లో అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. పెళ్లకూరు పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న కానిస్టేబుళ్లు రామసుబ్బమ్మ, శ్రీనివాసులు, రామకృష్ణను శుక్రవారం ఘనంగా సన్మానించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. తద్వారా బిడియం, భయం లేకుండా న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు రాగలుగుతారని వివరించారు. రామసుబ్బమ్మ, శ్రీనివాసులు ఓజిలి పోలీస్‌స్టేషన్‌కు, రామకృష్ణ చిల్లకూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాఘవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు



చెరువు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ గోపి

బాలాయపల్లి(సైదాపురం): వేసవి సెలవుల్లో పిల్ల లు ఈతకు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా మన్నూరు, పాకపూడి, కయ్యూరు చెరువుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు బాలాయపల్లి ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆయన శుక్రవారం జయంపు, హస్తకావేరి జంక్షన్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, ఎప్పటికప్పుడు సీసీ ఫుటేజీని పరిశీలిస్తూ నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కానిస్టేబుల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.